# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 03-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారతదేశం అంకితభావం వినూత్న ప్రయత్నాల ఫలితంగా క్షయ వ్యాధి బారిన పడ్డ వరి సంఖ్య తగ్గుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- ఝూర్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ మేనిఫెస్టో - సంకల్ప్ పత్రాన్ని బీజేపీ నేత అమిత్ షా ఈరోజు రాంచీలో విడుదల చేశారు.

- కేరళలోని అంగమాలి నుంచి ఎరుమేలి వరకు అసలైన అలైన్‌మెంట్ ప్రకారమే శబరి రైలు మార్గాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) భారత మొదటి అనలాగ్ స్పేస్ మిషన్‌ను లడఖ్‌లోని లేహ్‌లో ప్రారంభించింది.

==============================

భారతదేశం అంకితభావం వినూత్న ప్రయత్నాల ఫలితంగా క్షయ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య తగ్గుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. సామూహిక స్ఫూర్తితో టీబీ రహిత భారతదేశం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నివేదిక ప్రకారం 2015 నుండి 2023 వరకు భారతదేశం టీబీ వ్యాధి వ్యాప్తిలో 17.7 శాతం క్షీణతను నమోదు చేసిందని వెల్లడించారు. ఇదే సమయంలో ప్రపంచ క్షీణత 8.3 శాతం మాత్రమేనని, ప్రపంచం కంటే రెట్టింపు క్షీణత భారతదేశంలో ఉందని తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన పోషకాహారాన్ని అందించడానికి "ని - క్షయ్ పోషణ్ యోజన" వంటి కీలక కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ప్రభుత్వం జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని బలోపేతం చేసిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

==============================

రానున్న కాలంలో ఆస్ట్రేలియాతో సంబంధాలు మరింతగా బలపడే విధంగా భారతదేశం ఒక ముసాయిదా రూపొందించిందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. తన రెండు దేశాల పర్యటనలో భాగంగా ఈ రోజు

ఆస్ట్రేలియా బ్రిస్బేన్‌లో భారతీయ సమాజాన్ని ఉద్దేశించి కేంద్రమంత్రి మాట్లాడారు. భారతదేశం ఘనమైన అభివృద్ధి పథంలో ఉందని, ప్రపంచంతో పాటు ఎదగాలని కోరుకుంటున్నదని చెప్పారు. ప్రపంచంలోని ఎంపిక చేసిన దేశాలతో భారత్‌కు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, అటువంటి దేశాలలో ఆస్ట్రేలియా ఒకటని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

ఇదిలా ఉండగా తన ఆస్ట్రేలియాలో పర్యటన సందర్భంగా జైశంకర్ బ్రిస్బేన్‌లో భారత నాల్గవ కాన్సులేట్‌ను ప్రారంభించనున్నారు. ఆస్ట్రేలియన్ పార్లమెంట్ హౌస్‌లో జరగనున్న 2వ రైసినా డౌన్ అండర్ ప్రారంభ సెషన్‌లో ఆయన కీలకోపన్యాసం చేస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ మేనిఫెస్టో - సంకల్ప్ పత్రాన్ని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత అమిత్ షా ఈరోజు రాంచీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా ప్రసంగిస్తూ... బీజేపీకి ఓటు వేస్తే ఝార్ఖండ్‌లో యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలవుతుందని, అయితే గిరిజనులు మాత్రం యూసీసీ పరిధికి దూరంగా ఉంటారని అన్నారు. "గోగో-దీదీ" యోజన కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు 2 వేల 100 రూపాయలు ఇవ్వనున్నామని తెలిపారు. అన్ని కుటుంబాలకు 5 వందల రూపాయలకే ఎల్‌పిజి సిలిండర్‌ను అందజేస్తామని, దీపావళి, రక్షాబంధన్ సందర్భంగా 2 ఉచిత సిలిండర్లు ఇస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పండుగ సీజన్ కారణంగా భారతీయ రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. దీనిలో భాగంగా ఢిల్లీ - జాతీయ రాజధాని ప్రాంతం నుండి దేశంలోని వివిధ ప్రాంతాలకు దాదాపు 20 పండుగ ప్రత్యేక రైళ్లు ఈరోజు బయలుదేరాయి. వీటిలో దర్భంగా, రాంచీ, పాట్నా, కత్రా, ముజఫర్‌పూర్, బల్లియా, కామాఖ్య, అజంగఢ్‌లకు వెళ్ళే  ప్రత్యేక రైళ్లు కూడా ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, మహేల ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ఈ రోజు భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. రాబోయే నాలుగు రోజుల్లో వాయువ్య, తూర్పు భారతదేశంలో కనిష్ట , గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుండి మూడు డిగ్రీల సెల్సియస్ వరకు క్రమంగా తగ్గుతాయని వివరించారు. అండమాన్ నికోబార్ దీవుల్లో కూడా ఈ నెల 5న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాబోయే 2-3 రోజుల్లో ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతంలో రాత్రి, ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే  అవకాశం ఉందని IMD తన అంచనాలో పేర్కొంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళలోని అంగమాలి నుంచి ఎరుమేలి వరకు అసలైన అలైన్‌మెంట్ ప్రకారమే శబరి రైలు మార్గాన్ని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. కేరళలో ఈ రోజు మంత్రి పర్యటించారు. వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్ష చేసిన అనంతరం  త్రిసూర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేరళ ప్రభుత్వం ప్రతిపాదించిన హై-స్పీడ్ కె-రైల్ ప్రాజెక్ట్ ను మంత్రి ప్రస్తావిస్తూ... ప్రాజెక్ట్‌కు సంబంధించిన పర్యావరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తే, ఆ ప్రాజెక్టు కూడా చేపడతామని స్పష్టం చేశారు. కేరళలో రైల్వేల సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొంటూ....

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) భారత మొదటి అనలాగ్ స్పేస్ మిషన్‌ను లడఖ్‌లోని లేహ్‌లో ఈరోజు ప్రారంభించింది. భారతదేశం సమీప భవిష్యత్తులో చంద్రునిపైకి మానవుడిని పంపాలని యోచిస్తున్న తరుణంలో ఈ చర్య అత్యంత  ప్రాముఖ్యతను సంతరించుకుంది. అంతరిక్ష విపరీత భౌతీక వాతావరణాలను పోలిన వాతావరణం కలిగి ఉన్న భూమిపై ప్రదేశాల్లో క్షేత్ర పరీక్షలను అనలాగ్ స్పేస్ మిషన్ నిర్వహిస్తుంది. అంతరిక్ష ప్రయాణ పరిశోధనలో సమస్యల పరిష్కారంలో ఈ మిషన్ ముఖ్యమైన పాత్ర పోసిస్తుంది. చంద్రునిపై నివాసాలను ఏర్పాటు చేయాలనే భారతదేశం యొక్క ప్రణాళికల నేపథ్యంలో, అంతర గ్రహ మిషన్లను ప్రారంభించడానికి నెల రోజుల ఈ మిషన్ ఒక దారిని చూపనుంది. ఈ మిషన్ పై ఇస్రో సామాజిక మాధ్యమ వేదికగా స్పందిస్తూ.. లేహ్‌లో అనలాగ్ స్పేస్ మిషన్ ను... హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్, ఇస్రో, AAKA స్పేస్ స్టూడియో, లడఖ్ విశ్వవిద్యాలయం, IIT బాంబే సంయుక్తంగా చేపడుతుండగా... లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారం అందిస్తున్నదని ఇస్రో పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ,  అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య సహకారంతో, న్యూఢిల్లీలో ఈనెల 5, 6 తేదీల్లో మొదటి ఆసియా బౌద్ధ శిఖరాగ్ర సదస్సును  నిర్వహిస్తోంది. ఈ శిఖరాగ్ర సమావేశ ఇతివృత్తంగా  'ఆసియాను బలోపేతం చేయడంలో బౌద్ధ ధర్మం యొక్క పాత్ర' నిర్ణయించారు. భారత్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ శిఖరాగ్ర సమావేశం ఆసియా అంతటా ఉన్న వివిధ బౌద్ధ సంప్రదాయాలకు చెందిన సంఘ నాయకులు, పండితులు, నిపుణులు, అభ్యాసకులను ఒక చోటకు చేర్చుతుంది. వారిలో చర్చలను, అవగాహనను పెంపొందించడానికి, బౌద్ధ సమాజం ఎదుర్కొంటున్న సమకాలీన సవాళ్లను పరిష్కరించడానికి, ఆసియాలో బుద్ధుని ధర్మంలో విభిన్న ఆలోచనలను ఒకచోట చేర్చడానికి ఈ శిఖరాగ్ర సమావేశం దోహదపడుతుందని భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“భాయ్ దూజ్” పండుగను దేశ వ్యాప్తంగా ఈరోజు ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ పండుగ  దేశంలోని వివిధ ప్రాంతాలలో భాయి ఫోటో, భౌబీజ్, భాయి టికా, యమ ద్వితీయ వంటి వివిధ పేర్లతో జరుపుకుంటారు. ఈ రోజున, అక్క చెల్లెళ్ళు తమ అన్నదమ్ముల  నుదిటిపై తిలకం దిద్ది వారి క్షేమం, దీర్ఘాయువు కోసం ప్రార్థిస్తారు. బదులుగా, సోదరులు తమ సోదరీమణులను కాపాడతామని, ఎల్లవేళలా వారిని చక్కగా చూసుకుంటామని వాగ్దానం చేస్తారు. ఇదిలా ఉండగా “భాయ్ దూజ్” పవిత్ర పండుగ సందర్భంగా దేశ ప్రజలందరికీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, అంకితభావం, భక్తితో కూడిన ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో అపారమైన ఆనందాన్ని తీసుకురావాలని అమిత్ షా సామాజిక మాధ్యమ వేదికగా ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =